


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

**73**

**(22' ఆగస్టు 68, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**ఈ సంవత్సరం** ఎక్కడ చూసినా అనావృష్టి పరిస్థితులేర్పడినాయి. శ్రావణ, భాద్రపదాలలో అతి జోరుగా కురిసే వర్షాలు ఈ సంవత్సరం అప్పుడో జల్లు, అక్కడో జల్లు కురుస్తూ, నేల మెత్తపడనీయకుండా విత్తనాలు పెరక్కుండా చేస్తున్నాయి.

రైతులు వర్షం వర్షం అంటూ వరుణదేవుని ప్రార్థిస్తున్నారొక్కరీతిగా. ప్రభుత్వం అనావృష్టిని గురించి ఆందోళన పడుతోంది. అనుకున్నట్లుగా వర్షాలు కురిసి పంటలు పండినప్పుడేగా ఎందరెన్ని గంతులు వేసినా?

దేశంలో పాపం పెరిగితే వర్షాలు సకాలంలో కురవకుండా బాధ పెడతాయని మనవాళ్ళ కొక విశ్వాసం వుంది. ఇప్పటివారికది మూఢవిశ్వాసంగా కనిపించవచ్చు.

పరిపాలకులలో ధర్మం లేకపోతే కూడా అనావృష్టి ఏర్పడుతుందనీ, దానివల్ల కరువు కాటకాలేర్పడి, ఆ రాజ్యానికి గల పరువు ప్రతిష్ఠలు పోగొడుతుందని కూడా మనకు కొన్ని నమ్మకాలుండేవి.

***మంత్రీ! వర్షాల లెక్క చెప్పు.***

నమ్మకాలేమిటి - పూర్వకాలంలో రాజులు మంత్రులను పిలిపించి, "నెలకు ఆరు వర్షాలు కురుస్తున్నాయా? పాడిపంటలు సమృద్ధిగా వున్నాయా? ప్రజలు రోగపీడితులు కాకుండా క్షేమంగా వున్నారా?" అని ప్రశ్నించేవారు. సమాధానం సరిగా వస్తే సంతృప్తి చెంది, తర్వాత తక్కిన రాజకీయాలలోకి దిగేవారు వర్షానికి అంత ప్రాముఖ్యత వుంది మరి.

వర్షాలకు సంబంధించిన 'మూఢనమ్మకాలు' మన దేశంలో చాలా వున్నాయి కప్పను వూళ్ళో వూరేగించి, పసుపు జల్లుతూ వుంటే వాన కురుస్తుందనేది ఒక నమ్మకం.

**కప్పతల్లీ నీళ్ళాడే**
**కడవల నీళ్ళు కావాలి**
**కప్పతల్లి నీళ్ళాడే**
**గొప్పగ వానలు కురవాలి**

అంటూ పాటలు పాడుతూ వుంటారు.

వానలు కురవకపోతే వరుణదేవుని ప్రార్థనలు జరుపుతూ వుంటారు. ప్రజలు భగవంతుణ్ణి మరచి తిరుగుతున్నప్పుడు యమధర్మరాజు కోపగించి ఇంద్ర, వరుణులను పిలిచి భూలోకంలో అనావృష్టి కల్పించమని అడుగుతాడట. ప్రజలలో భక్తితత్పరత ఏర్పడితే తప్ప వానలు కురిపించవద్దంటాడట.

కొన్ని ప్రాంతాలలో అందుకని ఇంద్రుని ప్రార్దించడం కూడా ఆచారం వుంది. ఒక ఆబోతును అచ్చుపోసి వదిలితే వర్షం పడుతుందనే ఆచారం కొన్ని ప్రాంతాలలో వుంది. బీదలకు అన్నదానం జరిగితే వర్షాలు పడతాయనే అభిలాషతో కొందరలా దానాలు చేస్తారుట.

అనావృష్టి సందర్భంలో దుర్భిక్ష మేర్పడుతుంది గనుక అన్నదానాలెలా సాధ్యమా అనిపించవచ్చు. వున్నదాంట్లోనే దానం.. తినబోయేది దానం చెయ్యడంలోనే గొప్ప ఫలితాలున్నాయంటారు పెద్దలు.

***పార్వతీదేవి - మేఘప్రార్ధన***

కొన్ని ప్రాంతాలలో పరమశివుణ్ణి ప్రార్ధిస్తారు వర్షాలకోసం. ఫాలనేత్రుని దయతో మేఘపూజలేర్పడి, వర్షాలు పడతాయని వీరి విశ్వాసం. శివుడు గరళం మింగి ఆ వేడి భరించలేక వెర్రివాడై తిరుగుతున్నప్పుడు పార్వతీమాత భర్త బాధ చూచి సహించలేక మేఘాలను ప్రార్ధించిందట వర్షాలు కురిపించమని.

**ఓ నవనీరద మేఘమాలా?**
**దిగిరావా! దిగిరావా!**
**విషపానముచే వేదన చెందెడు**
**నా పతి తాపము బాపగ**
**దయగొని దిగిరావా!**
**వో నవనీరద మేఘమాలా!**

అని ఆ ఇల్లాలు ఎలుగెత్తి నీలపయోద మాలికలను ప్రార్ధించింది. చివరకు గంగవచ్చి శివుని శిరస్సును చేరితేగానీ ఆ తాపం అణగలేదు. మరి మేఘదేవుని ప్రార్ధన పార్వతి అంతటి మహా మాతకు కూడా తప్పలేదు.

కొన్ని ప్రాంతాలలోవారికి విఘ్నేశ్వర్డు వర్షాన్నిస్తాడనీ, పంటలు పండిస్తాడనీ, విశ్వాసం వుంది మరో విచిత్ర మేమంటే 'గోండాలు' భీమసేనుణ్ణి వర్షాధిపతిగా తలచి కొలుస్తూ వుంటారు భీమసేనుడేమిటి? అని ఆశ్చర్యంగా తోచవచ్చు. గోండాలకు వరుణుని పేరు చెబితే వాడెవడు అని ప్రశ్నిస్తారు.

కొన్ని పాశ్చాత్య దేశాలలో వర్షం కొసం నగ్న నృత్యాలు చేస్తారుట. ఆ తాపానికి తట్టుకోలేక అలా చేయడం ప్రారంభించి, అదేమిటంటే, వర్షంకోసం అని వంకపెట్టి వుంటారు.

ఈ కాలంలో ఋష్యశృంగులు లేరు. ఉంటే వారిని అనావృష్టి ప్రాంతాలకు తక్షణం తీసుకుపోయి, వర్షాలు కురిపిస్తూ వుండేవారేమో. ఆయనగారికి ఎన్ని గౌరవ బిరుదులు లభించేవో?

***వర్షం కోసం ముసలమ్మల నృత్యం.***

మెసపాటోమియాలో ముసలమ్మల చేతిలో దివిటీలిచ్చి వీధులలో నృత్యం చేయిస్తారట. ఆ దృశ్యం చూడడానికి జనం గుంపులుగా జేరతారట. అలా వారు గంతులు వేస్తే తప్పకుండా చినుకులు పడతాయని వారి నమ్మకం. ముసలమ్మలకు మెయిలు దండు బెదిరి కుంభవృష్టి కురిపిస్తుందా?

మెక్సికో ప్రాంతాలలో వర్షాలు రాకపోతే గ్రామస్తులు ఆ కారణం వైరాలు పెట్టుకుని ఒకరినొకరు దుమ్మెత్తి పోసుకుంటారట. అలా కొన్నాళ్ళు పనులన్నీ మానుకుని తిట్టుకోడంతో ప్రొద్దులు గడుపుతారట తిట్టుకుంటే మబ్బులెలా కదిలి గంగ కురిపిస్తాయో తెలియదు.

వర్షాలు కురిపించటానికి వివిధప్రాంతాలలో విచిత్రమైన ఆచారాలున్నాయి. ఉత్తర హిందూస్థాన్‌లో అనావృష్టి సంభవిస్తే గ్రామంలో వున్న స్త్రీలు పొలాలకు వెడతారట. ఇద్దరు నగ్న సుందరులను నాగలికి ఎడ్లు కట్టినట్లు కట్టి మరో నగ్నసుందరిచేత మేడిపట్టించి భూమి దున్నిస్తారనీ, సుభాష్ రేలే అనే రచయిత పేర్కొన్నాడు.

ఇలా విచిత్రాలు ఇంకెన్నో వున్నాయి. సామాన్యంగా ప్రజలనుకునే విషయం దేశంలో ధర్మం, సత్యం, భక్తి లోపించడం వల్లనేనని ఆ భావంతోనే ప్రార్ధనలు జరుపుతూ వుంటారు. పూర్వకాలంలో నరసింహమెహతా, తాన్‌సేన్ వంటి మహాత్ముడు గానం చేస్తే వర్షం కురిసేదట.

మూగజీవులు గోవులు, మోరలెత్తి ఆకాశం వంక చూచి మౌన ప్రార్ధనలు చేస్తాయనీ, వాటి బాధ గమనించి వరుణుడు వర్షం కురిపిస్తాడనీ కొందరంటారు.

***ఆంధ్రదేశానికి దిష్టికొట్టింది.***

ప్రస్తుతం మన ఆంధ్రరాష్ట్రంలో కూడా అనావృష్టి ఏర్పడింది. ఏమిటీ ఘోరమని ఆలోచిస్తున్నారందరూ. ఈ ఏడు పంటలు సమృద్ధిగా పండినాయి. వచ్చే సంవత్సరం గతేమిటని విచారిస్తున్నారు.

నిజానికి మన రాష్ట్రానికి దిష్టి ఎక్కువయింది, రొష్టుకూడా తప్పడంలేదు. ‘భారతదేశపు ధాన్యరాశి‘ అని 'అన్నపూర్ణ' అనీ అన్ని రాష్ట్రాలవారూ చెప్పుకోడం, ఎక్కడ తండులాలు తక్కువైనా ఆంధ్రరాష్ట్రం దాచుకుని కూర్చుంది ధాన్యమంతాననీ, గొడవ చేయడం, నాగార్జున సాగర్ వాళ్ళకెందుకు దక్కాలి? అన్ని చుప్పనాతి తనం పడటం ఇన్నికారణాలవల్ల మన రాష్ట్రానికి దిష్టికొట్టింది.

దీనికేమిటి ఉపాయం? ఎన్ని వాగన్లు తరలిస్తే తగ్గుతుంది? దీనికంటే మంచి వుపాయం దిష్టి తియ్యడం! పది లారీల ఉప్పు ఆంధ్ర సరిహద్దులో త్రిప్పి తెచ్చి బంగాళాఖాతంలో పోస్తే దిష్టితగ్గి అనావృష్టి పరిస్థితి తప్పిపోతుందేమో.

●●●

Post your comments